క్లుప్తంగా

'ప్రతీ వీధికి సీసీరోడ్లు నిర్మిస్తాం'



భూమిపూజ చేస్తున్న కృష్ణారావు

కాగజ్‌నగర్‌రూరల్: ప్రతీ వీధికి సీసీరోడ్లు నిర్మిస్తామని జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. మంగళవారం మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నంబర్.13లో సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర సర్కార్ పనిచేస్తుందన్నారు. సమావేశంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న నాయకులు

దహెగాం: పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పుప్పాల మల్లక్క ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని కుంచవెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా ప్యాడ్‌లు అందజేస్తున్న పుప్పాల శ్రీనివాస్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తహసీల్దార్ సరిత పౌరహక్కులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులను వివరించారు. పౌరులు తమ హక్కులను కాపాడుకోవాలని ఇతరులను గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుర్గం రాజన్న, మండల కోఆప్షన్ సభ్యుడు సాజీద్, ఆర్ఐ గోపాల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు వేయించాలి

కౌటాల: జీవాలకు పశుపోషకులు నట్టల నివారణ మందులు వేయించాలని మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని తలోడి గ్రామంలో మేకలు, గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందులు వేశారు. ఆయన మాట్లాడుతూ నట్టల నివారణ మందులు మూగజీవాలకు వేస్తే ఆరోగ్యంగా ఉంటాయన్నారు. సర్పంచ్ సోల్ల శంకరమ్మ, సిబ్బంది రాజన్న, సందీప్ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం	: ధమాక

కాగజ్‌నగర్

వెంకటరమణ	: ధమాక

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	100
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	40
బీరకాయ	40
కాకరకాయ	50
బెండకాయ	120
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజ	40

-ఆసిఫాబాద్‌అర్బన్

ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేనా..?

- శివగూడలో 13 రెడీమేడ్ గృహాల నిర్మాణానికి శ్రీకారం
- ఒక్కో ఇంటి వ్యయం రూ.3.40 లక్షలు
- ఒక ఇంటి నిర్మాణం పూర్తి
- పెండింగ్‌లోనే మిగితావి



అసంపూర్తి పనులతో దర్శనమిస్తున్న ఇళ్లు



నిర్మాణం పూర్తయిన ఒకే ఒక రెడీమేడ్ గృహం

కెరమెరి: ఉండేందుకు ఇల్లు లేక, కట్టుకునేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక తలదాచుకోవడానికి ఇబ్బంది పడుతున్న ఆదిమ గిరిజనుల కోసం ఐటీడీఏ అధికారులు రెడీమేడ్ ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు గతంలో శ్రీకారం చుట్టారు. మండలంలోని బాబేఝరి గ్రామ పంచాయతీలోని శివగూడ గిరిజన గ్రామాన్ని ఎన్నుకొని నూతన హంగులతో రెడీమేడ్ ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. గ్రామంలో మొత్తం 13 కుటుంబాలు ఉండగా జూన్‌లో ఓ ఇంటి నిర్మాణం పూర్తయింది. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు ఇప్పటివరకు పెండింగ్‌లోనే ఉన్నాయి.

కొనసాగుతున్న పనులు

గ్రామంలో మొత్తం 13 ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటివరకు ఒక ఇంటి నిర్మాణం మాత్రమే పూర్తయింది. మిగిలిన 12 గృహాలు రెండు నెలల క్రితమే పూర్తి కావాల్సి ఉన్నా ఇప్పటికీ నాలుగు ఇండ్లకు మాత్రమే పైకప్పు వేసి గోడలతో సిద్ధంగా ఉన్నాయి. వాటికి తలుపులు, విద్యుత్ పనులు, టైల్స్, బాత్‌రూమ్‌లు, రంగులు వేయడం వంటి పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. మిగిలిన 8 గృహాలకు కేవలం పైకప్పుగా రేకులు వేసి ఉన్నాయి. వేగంగా పనులు చేస్తే ఒక్కో ఇల్లు ఐదు రోజుల్లో పూర్తవుతుంది. అయినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

ఒక్కో ఇంటి వ్యయం రూ.3.40 లక్షలు

గ్రామంలో ఉన్న 13 కుటుంబాలకు రెడీమేడ్ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఐటీడీఏ అధికారులు ఆదేశించారు. ప్రయోగాత్మకంగా ఒక ఇంటి నిర్మాణం జూన్‌లో పూర్తి చేశారు. ఒక్కో ఇంటికి రూ.3.40 లక్షలు వెచ్చిస్తున్నారు. హాల్, బెడ్‌రూం, కిచెన్, మరుగుదొడ్లు, నేలకు రంగురంగుల టైల్స్ తదితర సౌకర్యాలతో ఇంటి నిర్మాణం చేపట్టనున్నారు. దీంతోపాటు కిటికీలకు కూలింగ్ అద్దాలు సైతం అమరుస్తారు. 50 ఏళ్ల వరకు ఇల్లు చెక్కుచెదరకుండా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

నెల రోజుల్లో పూర్తి

ఇప్పటికే నాలుగు ఇళ్లకు సంబంధించిన 80శాతం పనులు పూర్తయ్యాయి. వర్కర్లు గ్రామంలోనే ఉండి పనులు చేస్తున్నారు. మిగిలిన ఇళ్లకు రేకులు వేశాం. నెల రోజుల్లో వాటి నిర్మాణాలు సైతం పూర్తిచేస్తాం.

- నజీమొద్దిన్, ఐటీడీఏ ఏఈ

అటెన్షన్ ప్లీజ్.. ఇంకుడు గుంత.. మురుగుతో తంటా!



తాగునీటి చేతిపంపు వద్ద మురుగు నీరు

వాంకిడి: అధికారులు తూతూమంత్రంగా ఇంకుడు గుంతలను నిర్మించడంతో ప్రజలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని ఖమాన గ్రామ పంచాయతీ కేంద్రంలో కనర్‌గాం ఎక్స్‌రోడ్డు వద్ద గల తాగునీటి చేతిపంపునకు అనుసంధానంగా కొన్ని నెలల క్రితం ఇంకుడు గుంత నిర్మించారు. అడ్డదిడ్డంగా ఇంకుడు గుంత నిర్మించడంతో నీరు ఇంకడం లేదు. దీంతో మురుగు నీరంతా నిల్వ ఉండడంతో పాటు తాగునీరు కలుషితమవుతుందని స్థానికులు వాపోతున్నారు. మురుగు నీటితో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

సంబంధిత అధికారి : పోషం, పంచాయతీ కార్యదర్శి
సెల్ నంబర్ : 9985000621

కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగుల నిరసన

కాగజ్‌నగర్‌టౌన్: విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యోగులు చేపడుతున్న నిరసన కార్యక్రమాలు మంగళవారం కూడా కొనసాగాయి. తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులు స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. జేఏసీ కో కన్వీనర్ ఎమ్మాజీ సతీష్, నాయకులు రాజశేఖర్, శ్రీనివాస్, రామకృష్ణ, తిరుపతి, శ్రీరాములు, స్వామి పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారకులను శిక్షించాలి



కెరమెరి: కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

కెరమెరి: డాక్టర్ ప్రీతి మృతికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని బంజార సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని అనార్‌పల్లి గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాథోడ్ శంకర్ నాయక్, బాదావత్ ధన్‌రాజ్, వెంకట్‌రాం, బాణోత్ వెంకటి, రాజేశ్, కృష్ణ, తిరుపతి, మిట్టు, రాజేశం, బల్‌వంత్‌రావు ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: ర్యాగింగ్ భూతంతో ఆత్మహత్య చేసుకున్న వైద్య విద్యార్థిని ప్రీతి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం రాత్రి కౌటాల మండల కేంద్రంలో విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ తీశారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాల, వేంపల్లి ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా సర్‌సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు వివిధ రకాల నమూనాలను తయారు చేశారు. కార్యక్రమాల్లో జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్, హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ పట్టణంలో..

కాగజ్‌నగర్‌టౌన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం, వైస్ ప్రిన్సిపాల్ రాజు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల (పెట్రోల్ పంపు)లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఎగ్జిబిషన్ నిర్వహించారు.

సైన్స్ అండ్ టెక్నాలజీపై అవగాహన ఉండాలి



కాగజ్‌నగర్‌రూరల్: నివాళులర్పిస్తున్న ఎంపీడీవో

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం గజ్జిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీవీరామన్ చిత్రపటానికి పూలమాల వేసి సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సైన్స్‌ను నిత్యజీవితంలో ప్రతిక్షణం ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలని, సైన్స్‌పై శ్రద్ధ కలిగి ఉండాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, పాక శ్రీనివాస్, మనోజ్‌కుమార్, అన్నపూర్ణ, వనిత, సునీత, ఝాన్సీ, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



రెబ్బెన: విజ్ఞాన మేళాలో విద్యార్థుల ప్రదర్శనలు

రెబ్బెనలో..

రెబ్బెన: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు లేతన్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం జాతీయసైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్‌సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. లేతన్‌గూడ పాఠశాలలో విద్యార్థులు పరిసరాల విజ్ఞాన మేళా ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మల్లికార్జున్, సర్పంచ్ అహల్యాదేవి, హెచ్ఎంలు మేడి చరణ్‌దాస్, రవికుమార్, ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు అనీస్ పాల్గొన్నారు.

సిడాం అర్జుకు సన్మానం

నార్నూర్(జైనూర్): అఖిల జాతీయ గోండ్వాన మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు, గోండ్వాన రత్న అవార్డు గ్రహీత సిడాం అర్జును మంగళవారం జైనూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ కనక యాదవ్‌రావు మాట్లాడుతూ అర్జు ఆదివాసీ అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నాయకులు మెస్రం అంబాజీ, కోవ లక్ష్మి ఫౌండేషన్ మండల కన్వీనర్ పెందోర్ మోహన్, ఆత్రం మారుతి తదితరులు ఉన్నారు.



సిడాం అర్జును సన్మానిస్తున్న కనక యాదవ్‌రావు

మండల అభివృద్ధికి సహకరించాలి

- ఎంపీపీ డోకే రోజారమణి



మాట్లాడుతున్న అధికారులు

బెజ్జూర్: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ డోకే రోజారమణి అన్నారు. మంగళవారం స్థానిక రైతువేదికలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు. సోమిని గ్రామంలో నెలకొన్న భగీరథ నీటి సమస్యలు పరిష్కరించాలన్నారు. నీటి ఎద్దడిని పరిష్కరించాలని సమావేశంలో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్యలు పరిష్కారం కావడం లేదని, అలాంటప్పుడు సర్వసభ్య సమావేశం ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. మిషన్ భగీరథ నీటి సమస్యను పరిష్కరించేందుకు నిధులు లేవని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ పుష్పలత, సహకార సంఘం చైర్మన్ ఓం ప్రకాశ్, ఎంపీడీవో మాధవి, ఎంపీవో రమేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ తోటాజీ, అధికారులు, పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం



సన్మానిస్తున్న అధికారులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో మంగళవారం పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఓసీపీ అధికారులు, తోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఓసీపీలో పనిచేసిన బైరి చక్రపాణి, సయ్యద్ ఫిరోజ్ షానక్వీ, ఉప్పల కనకయ్య, ఆకుల వెంకటి, టి. సాంబయ్య, గొట్టె రాజనర్సులను ఓసీపీ ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్, మేనేజర్ ప్రవీణ్ ఫటింగ్‌లు శాలువాలతో సన్మానించారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, సేఫ్టీ అధికారి రాజేశ్వరరావు, పిట్ కార్యదర్శి వెంకటేష్, పర్సనల్ ఆఫీసర్ వేణు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

బెల్లంపల్లి ఏరియా పర్సనల్ డిపార్టుమెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి శ్రీరాంపూర్ ఏరియాకు బదిలీపై వెళ్తున్న పి.సత్యనారాయణను మంగళవారం జీఎం కార్యాలయంలో పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులు, ఉద్యోగులు సన్మానించారు. సీనియర్ పర్సనల్ అధికారి కిరణ్‌కుమార్, సంక్షేమ అధికారులు వేణు, ప్రశాంత, ఉద్యోగులు రమణ, రాఘవేంద్ర, బాబా పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళికపై శిక్షణ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో సభ్యులకు మంగళవారం వార్షిక ప్రణాళిక, బడ్జెట్ తయారీపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీపీఎంలు యశోద, యాదగిరి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం మహిత, భూమక్క, శ్రీనివాస్, ఆడిటర్లు రాజ్‌కుమార్, శంకరయ్య, సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాలేజ్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని వివేకానంద కళాశాలలో కాలేజీడే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వినయ్ గార్డెన్‌లో నిర్వహించిన వేడుకలకు జిల్లా ఇంటర్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక, నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ హనూక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధరలకు అనుగుణంగా రేట్లు పెంచాలి

తిర్యాణి: రోజురోజుకూ పెరుతున్న ధరలకు అనుగుణంగా పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజన రేట్లను పెంచాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా నాయకుడు క్రిష్ణమాచారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కుమురం భీం భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం రూ.18 వేలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మడావి చంద్రకళ, ప్రధాన కార్యదర్శిగా మనుబోతుల లక్ష్మి, ఉపాధ్యక్షులుగా గుండం వినోద, సహాయ కార్యదర్శులుగా ఊర్మిళ, విజయలక్ష్మిలను ఎన్నుకున్నారు.

'బెంగాలీలకు సాగునీరు అందించాలి'

కాగజ్‌నగర్‌రూరల్: బెంగాలీలకు సాగునీరు అందించాలని బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.4, 5, 12, ఈజ్‌గాం మార్కెట్ ఏరియాలో నిర్వహించిన బీజేపీ భరోసా శక్తి కేంద్రం స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బెంగాలీలకు అప్పర్‌డ్యాం, లోయర్ డ్యాం, అడ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందిస్తే కూరగాయలు పండిస్తారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రభారి రాజమౌళిగౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాళిదాస్ ముజుందార్, రాష్ట్ర బీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు గోలెం వెంకటేశం, మండల అధ్యక్షుడు బికాస్ ఘరామీ, మండల ఇన్‌చార్జి అశోక్, మండల ప్రధాన కార్యదర్శులు దీపక్, కార్తీక్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి సమీర్ గుప్త, నీల్‌కమల్, రవీందర్, అఘుతోష్ మండల్, మందాడె సుధాకర్, ఓంప్రకాశ్, రమేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు హరీష్‌బాబు

బెజ్జూర్: క్రీడల్లో గెలుపోటములు సహజమని బీజేపీ నేత పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండలంలోని కుంటలమానెపల్లి గ్రామంలో నిర్వహించిన కుమురం భీం స్మారక క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. గెలుపొందిన సిర్పూర్(టి), కుంటలమానెపల్లి జట్టుకు నగదుతో పాటు బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచ్ విజయ్, పార్టీ మండల అధ్యక్షుడు దిగంబర్, నాయకులు బాలకృష్ణ, తిరుపతి, పాపయ్య, సంజీవ్, చిలుకయ్య, మహేష్ పాల్గొన్నారు.

'భగీరథ' నీరు అందించరూ..!

కెరమెరి: మిషన్ భగీరథ నీరు అందించాలని మండలంలోని పాటగూడ, చాల్‌బాడి గ్రామానికి చెందిన ఆదివాసీలు కోరారు. మంగళవారం మండలంలోని తహసీల్దార్ సాయన్నకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వేసవి కాలం ప్రారంభం కాకముందే నీటి ఎద్దడి ఏర్పడుందన్నారు. గ్రామంలో మిషన్ భగీరథ ట్యాంకు నిర్మించినా అందులోకి నీటిని సరఫరా చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే అధికారులు స్పందించి తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో మానిక్‌రావు, ఆత్రం పావుగా, గేడాం భీంరావు, గోవింద్‌రావు తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆదివాసీలు

ఘనంగా ప్రపంచ టైలర్స్ డే



కేక్ కట్ చేస్తున్న సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో మంగళవారం మేరు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు రాపర్తి కార్తీక్ మాట్లాడుతూ మేరు కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు దుస్తులు కుట్టే టెండర్స్‌ను మేరు కులస్తులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు సతీష్, మధునయ్య, వెంకటేష్, శంకర్, బాలాజి, మల్లేష్, శ్రావణ్, దయాసాగర్, విజయ్, నవీన్, రమేష్, రాజేందర్, ప్రణయ్ పాల్గొన్నారు.